క్లుప్తంగా

ఆర్థిక సాయం



ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన బొగ్గుల రామకృష్ణ తునికిపండ్ల కోసేందుకు వెళ్లి చెట్టుపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో బాధితుడికి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ సభ్యులు విరాళాలు సేకరించి శనివారం రూ.84వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వహిద్ మాట్లాడుతూ.. బొగ్గుల రామకృష్ణ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేక ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ సభ్యులను సంప్రదించగా అతని ఆదుకునేందుకు తమ వంతుగా వాట్సప్ గ్రూప్‌లో ఉన్న అభ్యర్థులను అభ్యర్థించగా వారికి తోచిన నగదును అందజేశారన్నారు. రామకృష్ణ ప్రస్తుతం వరంగల్‌లోని ఓ ఆస్పత్రిలో దవడ, కాలువిరిగిపోగా ఆపరేషన్ చేయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రమనేని సతీష్, ఎంపెల్లి నరేష్, గండెపల్లి సుఖేష్, కయ్యూమ్, ఎస్కే సాబీర్, బండపల్లి సంతోష్ పాల్గొన్నారు.

బియ్యం అందజేత



వెంకటాపురం(ఎం): మండలంలోని నర్సింగాపురానికి చెందిన ఉడుత కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని శనివారం బీజేపీ నాయకులు పరామర్శించి చేయూతనందించారు. పార్టీ తరఫున 50 కిలోల బియ్యాన్ని, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా బీజేపి నియోజకవర్గ కన్వీనర్ సిరికొండ బలరాం, రాష్ట్ర నాయకుడు రాజునాయక్ మాట్లాడుతూ.. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, కొమురయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు జవహర్‌లాల్, నాయకులు కారుపోతుల యాదగిరి, వినోద్, దేవేందర్, సంతోష్, శ్రీధర్, రమేష్, సుమన్‌రావు, ధరంసింగ్, సురేష్, రూప్‌సింగ్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

నియామకం



వెంకటాపురం(కె): రెడ్డి సంక్షేమ సంఘం చీఫ్ అడ్వైజర్‌గా హైకోర్టు న్యాయవాది, వెంకటాపురం మండల వాసి పిట్టా శ్రీనివాస రెడ్డిని నియమిస్తు రెడ్డి సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకులు కైలా దేవేందర్ రెడ్డి, సంజీవ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

హామీలు విస్మరించిన ప్రభుత్వాలు



కొత్తగూడ: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆరోపించారు. శనివారం మండలంలోని ఓటాయిలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు పెంచి కేంద్రం పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. ఉద్యోగాలు అమ్ముకొని నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి వంద కుటుంబాలు సీతక్క ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఓడీసీఎంఎస్ వైస్ చైర్మన్ విధానాలు నచ్చక కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోతు విజయరూప్‌సింగ్, కొత్తగూడ, గంగారం జెడ్పీటీసీలు పుష్పలత, రమ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రవేశ పరీక్ష

మొగుళ్లపల్లి: గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం కోసం నేడు(ఆదివారం) నిర్వహించనున్న పరీక్షకు కొర్కిశాల గ్రామంలోని మోడల్ స్కూల్‌లో అన్ని ఏర్పాట్లు చేసినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హైమావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు ఉదయం 10 గంటల లోపు పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని, పరీక్ష ప్రారంభించిన తర్వాత పరీక్షా హాల్‌లోకి అనుమతి లేదని తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్‌ను ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని వెంట తీసుకొనిరావాలని సూచించారు. విధిగా మాస్కు ధరించాలన్నారు. పరీక్షా కేంద్రానికి పరకాల నుంచి ఉదయం 8.30 గంటలకు, 9 గంటలకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంటుందన్నారు.



ములుగు: రంజాన్ వేడుకల్లో ఎమ్మెల్యే సీతక్క



ఏటూరునాగారం: శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



ఏటూరునాగారం: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఏటూరునాగారం: అలయిబలయి చేసుకుంటున్న చిన్నారులు

ఘనంగా రంజాన్ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా రంజాన్ వేడుకలు ముస్లింలు శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈద్గా వద్ద ఈదుల్‌ఫితర్ నమాజ్ ప్రార్థనలు చేశారు. నెల రోజులుగా పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస కఠిన దీక్షలు చేశారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్న పెద్ద తేడా లేకుండా కొత్త బట్టలు ధరించి ఈద్గాలో మత పెద్ద బోధనలు పాటిస్తు ఈదుల్ ఫితర్ నమాజ్‌లో పాల్గొన్నారు. అనంతరం ఆత్మీయ ఆలింగనాలు చేస్తు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకల్లో పలు పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



వెంకటాపురం(కె): ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఏటూరునాగారం: బాలిక, బాలుర శుభాకాంక్షలు



వెంకటాపురం(ఎం): పాలంపేటలో..



మంగపేట: ప్రార్థనలు చేస్తున్న చిన్నారులు



కన్నాయిగూడెంలో..



మంగపేటలో..



ములుగు రూరల్: అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న ముస్లింలు



కమలాపురంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ములుగులో..

బీసీలు ఏకతాటిపైకి రావాలి



శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న బీసీ సంఘం నేతలు

ములుగు: న్యాయపరమైన హక్కులను సాధించుకోవడంతో పాటు చట్టసభల్లో బలాన్ని నిరుపించుకోవడానికి బీసీలు ఏకతాటిపైకి రావాలని బీసీ జాతీయ సంక్షేమసంఘం జిల్లా యూత్ కన్వీనర్ చెరుకూరి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. కన్వీనర్‌గా నూతనంగా ఎంపికైన శ్రీకాంత్‌ను శనివారం జిల్లా కేంద్రంలో సంఘం నేతలు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ.. అన్ని మండలాల్లో బీసీ యువతను కలిసి సంఘం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన జిల్లా కన్వీనర్ బట్ట మురళీకృష్ణ, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్, రాజు, దేవేందర్, కౌశిక్, కుమార్, కోటి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో అన్నదాత





వెంకటాపురం(ఎం)లో ఆరబోసిన ధాన్యాన్ని కుప్పలుగా పోస్తున్న రైతులు

వెంకటాపురం(ఎం): ఒకవైపు మండుటెండలతో జనాలు అల్లాడుతున్నా.. ఆకస్మికంగా ఆకాశంలో మార్పులు వచ్చి కారుమబ్బులు కమ్ముకుంటుండడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. వారం రోజులుగా మండల రైతాంగం వరిని యంత్రాలతో కోస్తూ కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. ధాన్యంలో తేమ శాతం లేకుండా ఉదయం, సాయంత్రం వడ్లను నేర్పుతూ ధాన్యాన్ని విక్రయించేందుకు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. వరి కోతలు ప్రారంభమై పదిరోజులు కావస్తున్నప్పటికీ కొనుగోలు కేంద్రాల విషయంలో అధికారులకు ఇంకా స్పష్టత లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని చెబుతున్నప్పటికీ జిల్లాలో ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. శనివారం సాయంత్రం ఆకస్మాత్తుగా కారుమబ్బులు కమ్ముకోవడంతో పరుగుపరుగున రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం వద్దకు చేరుకొని ధాన్యాన్ని దగ్గరకు చేసి కుప్పలుగా పోశారు. పరదాలను కిరాయికి తీసుకవచ్చి ధాన్యం కుప్పలపై కప్పారు. పంట చేతికందే సమయంలో అకాల వర్షం ఇబ్బందులకు గురిచేస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగిలి రవి ప్రభుత్వాన్ని కోరారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రమేష్

మంగపేట: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేష్ అన్నారు. మండలంలోని అకినేపల్లిమల్లారం, కొత్తపేట(చెరుపల్లి), బుచ్చంపేట, వాడగూడెం, బోరునర్సాపురం, మంగపేటలో మంగపేట రైతు సేవా సహకార సంఘం (ఎఫ్ఎస్‌సీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం స్థానికంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్ డైరెక్టర్లు కోడం బాలకృష్ణ, నర్రా శ్రీధర్, సింగరబోయిన నర్సయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుదుముల లక్ష్మీనారాయణ, జిల్లా సీనియర్ నాయకులు వత్సవాయి శ్రీధర్‌వర్మ, యూత్ జిల్లా నాయకులు బాడిష నాగరమేష్, సీఈఓ జగన్నాథరావు, ఏఈఓ ఆక మహేష్, సమ్మయ్య, రమేష్ పాల్గొన్నారు.

ప్రశ్నించే వారిపై కేసులు సరికాదు

భూపాలపల్లి రూరల్: సమస్యలను ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేయడం సరికాదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండలంలోని కొంపల్లి గ్రామం మీదుగా నూతనంగా వేస్తున్న తారు రోడ్డు నిర్మాణ పనులను గ్రామస్తులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం కొంపెల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రహదారి నిర్మాణం నాణ్యత లేకుండా చేపట్టారని, నాణ్యతపై ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీ కొంపల్లి అధ్యక్షుడు మర్రి కృష్ణమూర్తితోపాటు మరికొంత మందిని అక్రమంగా అరెస్టు చేయడంపై ఆయన మండిపడ్డారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొంపల్లి గ్రామంలోని చిన్న దామెర పోలుకమ్మ చెరువుల నుంచి అక్రమంగా మొరం తరలిస్తుంటే అడ్డుకోవడం కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన తప్పా అని ప్రశ్నించారు. టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, సీనియర్ నాయకులు రాంనేని రవీందర్ ఉన్నారు.

ఐటీడీఏ ముట్టడి కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): ఈ నెల 24 న భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో భద్రాచలం ఐటీడీఏ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు అట్టూరి రఘురామ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో గిరిజన మోర్చా మండల అధ్యక్షులు మట్టి రమేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎంపీపీ చెరుకూరి సతీష్ కుమార్ హాజరై మాట్లాడారు. గిరిజన మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన భద్రాచలం ఐటీడీఏ ముట్టడి కార్యాక్రమాన్ని విజయవతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐటీడీఏ ముట్టడి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంకా హేమసుందర్, ఈశ్వరావు, రాజశేఖర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కూలీల ట్రాక్టర్ బోల్తా..

- ఆరుగురికి తీవ్ర గాయాలు, ఏడుగురికి స్వల్పగాయాలు



బోల్తాపడిన ట్రాక్టర్

చిట్యాల: కూలీలు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడి ఆరుగురికి తీవ్ర గాయాలు, ఏడుగురికి స్వల్ప గాయాలైన సంఘటన మండలంలోని బావుసింగ్‌పల్లి–ముచినిపర్తి గ్రామాల మధ్య శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలంలోని బావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన ఓ రైతుకు.. భూపాలపల్లి మండలంలోని నేరేడుపల్లి, కాశింపల్లి గ్రామాలకు చెందిన 36 మంది కూలీలు ఉదయం 6గంటలకే మిరపకాయలు ఏరడానికి వెళ్లారు. మధ్యాహ్నం పని అనంతరం తిరుగుప్రయాణంలో బావుసింగ్‌పల్లి–ముచినిపర్తి గ్రామాల మూలమలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా కొట్టినట్లు తెలిపారు. అందులో ఆరుగురు కూలీలు పి.సిద్ధు, టి.సరస్వతి, ఎ.సరోజన, సుజాత, కె.వినోద, జి.సంధ్యాలకు కాళ్లు, వెన్నపూక బొక్కలు విరిగి తీవ్ర గాయాలపాయ్యారు. అలాగే మరో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించడంతో అక్కడికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మేరుగైన వైద్యం కోసం తీవ్ర గాయాలైన ఆరుగురిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా, డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. మిగతా ఏడుగురు స్థానిక ఆస్పత్రిలో చికిత్స తీసుకుని జిల్లా కేంద్రానికి తరలించారు.

వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై

మహాముత్తారం: మండలంలోని యామన్‌పల్లి ప్రధాన కూడలి వద్ద ఎస్సై సుధాకర్ శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. కాటారం నుంచి మేడారం వెళ్లే వాహనాలను ఆపి క్షుణ్నంగా పరిశీలించారు. వాహన పత్రాలను పరిశీలించి అనుమానితులతో మాట్లాడి వదిలేశారు. ఎస్సై వెంట సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.